



చిగురుమామిడిలో రోడ్ షోలో పాల్గొన్న బిఆర్‌ఎస్ శ్రేణులు, రోడ్ షోలో అభివాదం తెలుపుతున్న మంత్రి, ఎమ్మెల్యే

# కాంగ్రెస్‌ను నమ్మితే ఆగమైతం

- కేసీఆర్ అంటే నమ్మకం.. విశ్వాసం
- దొంగల చేతితో పెడితే తెలంగాణ ఉంటదా?
- ఆలోచించి ఓటు వేయండి... ఆరు నెలల్లో గౌరవెల్లి నీళ్లిస్తాం
- మంచి మనిషి సతీశ్‌కుమార్‌ను గెలిపించండి
- చిగురుమామిడి రోడ్‌షోలో మంత్రి హరీశ్‌రావు
- భారీగా తరలివచ్చిన జనం

కరీంనగర్, నవంబర్ 21(నమస్తే తెలంగాణ)/చిగురుమామిడి : 'కాంగ్రెస్‌ను నమ్మితే ఆగమవుతాం.. ఆరు గ్యారంటీల మాట దేవుడెరుగు.. ఆరు నెలలకో ముఖ్యమంత్రి మారుతరు. తెలంగాణ తెచ్చిన కేసీఆర్ చేతిలో రాష్ట్రం ఉంటేనే బాగుంటుంది. అదే కాంగ్రెస్ దొంగల చేతికి పోతే ఆగమవుతుంది. ఎన్నికలంటే మూడొద్దుల పండగ కాదు.. ఐదేండ్ల మన భవిష్యత్తు. మనం ఎవరికి ఓటేస్తే బాగుపడతామో ఆలోచించాలి. కాంగ్రెస్ అంటే మోసకారి పార్టీ. ఇది నేనంటున్న మాట కాదు. కర్నాటక ప్రజలు అంటున్నారు. కట్కేస్తే వచ్చే కరెంటు కావాలా? కర్నాటక చీకట్లు కావాలా? ఆలోచించి ఓటేయండి. హుస్నాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్ మంచి మనిషి. ఆయనను గెలిపించండి. ఆరు నెలల్లో గౌరవెల్లి నీళ్లిస్తాం.. ఒగులాపూర్ రైతుల సమస్యలు పరిష్కరిస్తాం' అని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు హామీ ఇచ్చారు. మంగళవారం హుస్నాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌కు మద్దతుగా అక్కన్నపేట, కోహెడ, చిగురుమామిడి మండలకేంద్రాల్లో నిర్వహించిన భారీ రోడ్ షోల్లో ఆయన ప్రసంగించారు. కాంగ్రెస్ అంటే మోసకారి పార్టీ అని కర్నాటక ప్రజలు అంటున్నారని, ఆ రాష్ట్రంలో ఐదు గ్యారంటీలు ఇస్తమని చెప్పిన రాహుల్, ప్రియాంకా గాంధీ ఇప్పుడు పత్తా లేకుండా పోయారని, అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే ఉన్న కరంట్ బంద్, బస్సులు బంద్ అయ్యాయని, విద్యార్థులకు ఇచ్చే స్కాలర్ షిప్‌ల్లో కోతలు పెట్టారని, కరంట్ బిల్లులు డబుల్ చేశారని కార్నటక ప్రజలు ఇక్కడికి వచ్చి చెప్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీని నమ్మి మేం మోసపోయామని అంటున్నారని, తెలంగాణ ప్రజలు మోస పోవద్దని చెబుతున్నారని అన్నారు. అక్కడ కాంగ్రెస్ గెలిచిన తర్వాత పొద్దంత రెండు గంటలు, రాత్రి మూడు గంటలు మాత్రమే కరెంట్ ఇస్తున్నామని కర్నాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమారే తాండూరు మీటింగ్‌లో స్వయంగా చెప్పారని, 24 గంటల కరెంట్ ఇస్తున్న తెలంగాణ గడ్డ మీద ఉద్ధారుకం చేసినమని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇటు ఆ పార్టీ నాయకుడు రేవంత్‌రెడ్డి వ్యవసాయానికి మూడు గంటల కరెంట్ ఇస్తే సరిపోతదని అంటున్నారని, మూడు గంటల కరెంట్‌తోని 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకుని మూడెకరాలు పారించుకోవాలని అంటున్నారని, ఇది ఎలా సాధ్యమని మంత్రి ప్రశ్నించారు. అంటే కాంగ్రెస్ నాయకులు ఎంత తెలవని తనంతో, ఎన్ని జూటా మాటలు మాట్లాడుతున్నారో అర్థం చేసుకోవాలని సూచించారు. తెలంగాణ రాకముందు ఇదే కాంగ్రెస్ అధికారంలో ఉందని, పొన్నం ప్రభాకర్ ఎంపీగా, శ్రీధర్ బాబు మంత్రిగా ఉన్నారని, అప్పుడు 24 గంటల కరెంట్ ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. కట్కేస్తే వచ్చే కరెంట్ కావాల్నా, కర్నాటక మాదిరి చీకట్లు కావాల్నా? ఒక్కసారి ఆలోచించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

### మళ్లీ వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమే

బీఆర్‌ఎస్ ప్రభుత్వమే మళ్లీ అధికారంలోకి వస్తుందని, జనవరి నుంచి సోనామసూరి బియ్యం ఇస్తామని కేసీఆర్ చెబుతున్నారని, మహిళల కోసం కేసీఆర్ చేసినంత ఇప్పటి వరకు ఎవరూ చేయలేదని మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు. మంచిగ చూసుకుంటున్న కేసీఆర్‌ను సాదుకుందామా.. చంపుకుందామా? అని మహిళలనుద్దేశించి అన్నారు. ఉద్యమంలో మనమంతా ప్రాణాలొడ్డి పోరాటం చేస్తుంటే జై తెలంగాణ అంటే కాల్చి పారేస్తానని తుపాకీ దగ్గర పెట్టుకొని రేవంత్‌రెడ్డి కరీంనగర్ మీటింగ్‌కు రాలేదా? అని ప్రశ్నించారు. పేగులు తెగేదాకా కొట్లాడి తెలంగాణ తెచ్చుకున్నదేమో మనమైతే తుపాకీ చేతుల పెట్టుకుని తిరిగిన తుపాకీ రాముడు రేవంత్‌రెడ్డి అని, ఇలాంటి ద్రోహుల చేతిలో తెలంగాణను పెడితే ఆగం కాదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీలో మూడు గ్రూపులు ఉంటాయని, ఇదే కరీంనగర్ జిల్లాలో శ్రీధర్‌బాబుది ఒక గ్రూపు, పొన్నం ప్రభాకర్‌ది మరొక గ్రూపు, జీవన్‌రెడ్డిది ఇంకో గ్రూపు ఉంటదని, వీళ్లు ఒకరి మాటలు ఇంకొకరు వినరని ఎద్దేవా చేశారు. ఏబుల్ లీడర్.. స్టేబుల్ గవర్నమెంట్ అంటే అది కేసీఆర్, బీఆర్‌ఎస్ తోనే సాధ్యమన్నారు. మిడ్ మానేరును పూర్తి చేసి చిగురుమామిడి మండలంలోని రేకొండ, బొమ్మనపల్లి, రామంచ, ఇందుర్తి, ముదిమాణిక్యం, లంబాడిపల్లె, సీతారాంపూర్, చిన్న ముల్కనూర్ గ్రామాలకు కాలువలు తవ్వించి నీళ్లు తెచ్చి ఇచ్చింది ఇదే గులాబీ జెండా అని మంత్రి స్పష్టం చేశారు.

### సతీశ్‌కుమార్ మంచి వ్యక్తి

హుస్నాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్ మంచి వ్యక్తి అని, ఆయనను ఎవరు కూడా విమర్శించరని, ఎవరైనా ఆయన ఇంటికి వెళ్తే అన్నం తినివచ్చారా? అని ఆయన ఇల్లు అడుగుతుందని, కడుపు నిండా అన్నం పెట్టే ఇల్లు వాళ్లదని మంత్రి కొనియాడారు. తెలంగాణ ఉద్యమంలో 14 ఏండ్ల పాటు కెప్టెన్ లక్ష్మీకాంతరావు ఇల్లే ఉద్యమకారులకు అన్నం పెట్టిందని గుర్తు చేశారు. అలాంటి కుటుంబాన్ని పట్టుకుని కొందరు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సతీశ్‌కుమార్‌కు కులం, మతం పట్టింపులు లేవని, తలలో నాలుకలా, అందరివాడిగా ఉంటారని, అలాంటి మంచి మనిషిని గెలిపించాలని కోరారు. గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తి చేశామని, త్వరలో కాలువలు కూడా పూర్తి చేసి ఆరు నెలల్లో నీళ్లందించే బాధ్యత తనదేనన్నారు.

### రోడ్‌షోలకు పోటెత్తిన జనం

హుస్నాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌కు మద్దతుగా ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్ రావు మంగళవారం నియోజకవర్గంలో నిర్వహించిన రోడ్‌షోలకు జనం పోటెత్తారు. చిగురుమామిడితో పాటు కోహెడ, అక్కన్నపేట మండలకేంద్రాల్లో రోడ్‌షోలు జరుగగా, ఆయనకు ఘనస్వాగతం పలికారు. చిగురుమామిడి మండల కేంద్రంలోని పెట్రోల్ బంకు నుంచి ప్రధాన వీధుల గుండా పెద్ద ఎత్తున బైక్ ర్యాలీతో రోడ్ షో నిర్వహించారు. మహిళలు కోలాటాలతో, యువకులు, ఒగ్గు కళాకారుల నృత్యాలతో ర్యాలీ తీశారు.

**అభివృద్ధిని చూసి ఓటెయ్యండి..**

హుస్నాబాద్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి చూసి ఓటేయండి. సీఎం కేసీఆర్ సహకారంతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం. నియోజకవర్గానికి అత్యధికంగా నిధులు తీసుకువచ్చాం. చిగురుమామిడి మండలానికి గోదావరి జలాలను తెచ్చి చెరువులు నింపి రైతులకు సాగునీటికి ఇబ్బంది లేకుండా చేశాం. 60 ఏళ్లుగా చేపట్టని అభివృద్ధి పదేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టింది. ఎన్నికల సమయాల్లో వచ్చే నాయకుల మాయమాటలు నమ్మి మోసపోవద్దు. మరోసారి కారు గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించండి.

– బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

## బీఆర్‌ఎస్ ఇంటింటా ప్రచారం

భీమదేవరపల్లి, నవంబర్ 21: మండలంలోని అన్ని గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రత్నగిరి గ్రామంలో గడపగడపకూ వెళ్లి బొట్టు పెట్టే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హుస్నాబాద్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ చేసిన అభివృద్ధిని వివరించారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ జక్కుల అనిత, సర్పంచ్ వంగ సురేశ్, ఎంపీటీసీ మహబూబ్ అలీ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షురాలు ఏనుగు సత్యవతి, పార్టీ గ్రామ అధ్యక్షుడు అంకుషావళి, నాయకులు తిరుపతి, చింరజీవి, మోహన్ పాల్గొన్నారు.



రత్నగిరిలో నినాదాలు చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



వంశీధర్‌రెడ్డిని బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మంత్రి హరీశ్‌రావు

## బీఆర్‌ఎస్‌లో చేరిన వంశీధర్‌రెడ్డి

కోహెడ, నవంబర్ 21: ఏఐఎఫ్‌బీ రాష్ట్ర కార్యదర్శి గవ్వ వంశీధర్‌రెడ్డిపాటు 20 మంది నాయకులు మంగళవారం కోహెడలో నిర్వహించిన రోడ్‌షోలో మంత్రి హరీశ్‌రావు, వొడితెల సతీశ్‌కుమార్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి మంత్రి హరీశ్‌రావు గులాబీ కండువాలు కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. బీఆర్‌ఎస్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి పార్టీలో చేరినట్లు వంశీధర్‌రెడ్డి తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేడీసీసీ డైరెక్టర్ శ్రీపతి రవీందర్‌గౌడ్

## బీఆర్‌ఎస్‌తోనే గౌడ కులస్తుల సంక్షేమం

**సొసైటీ చైర్మన్ రవీందర్, జడ్పీటీసీ రవి**

ఎల్కతుర్తి, నవంబర్ 21: గౌడ కులస్తులను అన్ని విధాలా ఆదుకున్న ఏకైక ప్రభుత్వం బీఆర్‌ఎస్ అని ఎల్కతుర్తి సొసైటీ చైర్మన్ శ్రీపతి రవీందర్‌గౌడ్, భీమదేవరపల్లి జడ్పీటీసీ వంగ రవిగౌడ్ అన్నారు. మండలంలోని గౌడ కులస్తులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో పార్టీల మధ్య ఎన్నికలు జరిగేవని, ఇప్పుడు కులం పేరు చెప్పి పొన్నం ప్రభాకర్ ఓట్లు అడగడం వింతగా ఉందని ఎద్దేవా చేశారు. ఎంపీగా ఉన్నప్పుడు ఏ రోజు గౌడ కులస్తులను పొన్నం ప్రభాకర్ పట్టించుకోలేదని విమర్శించారు. ఇప్పుడు స్వలాభం కోసం గౌడ కులస్తుల్లో చిచ్చు పెడుతున్నాడని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం గౌడ కులస్తుల కోసం వైన్ షాపుల్లో 15 శాతం రిజర్వేషన్లు కల్పించడమే కాకుండా 50 ఏండ్లకే పింఛన్ అందిస్తున్నదన్నారు. కాంగ్రెస్ హయాంలో గీత కార్మికుడు చెట్టు పన్ను కట్టకపోతే మోకు తీసుకెళ్లేవారని గుర్తుచేశారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చాక ఆ పన్నును సీఎం కేసీఆర్ పూర్తిగా రద్దు చేశారని కొనియాడారు. సర్వాయి పాపన్న జయంతిని బీఆర్‌ఎస్ సర్కారు అధికారికంగా నిర్వహిస్తున్నదని గుర్తు చేశారు. ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ ఒక్క ఎల్కతుర్తికే రూ. 534 కోట్ల నిధులు కేటాయించారని వివరించారు. ప్రమాదవశాత్తు గీత కార్మికుడు చనిపోతే రూ. 10 లక్షల బీమా, అంగవైకల్యం చెందితే రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా అందిస్తున్న ఏకైక సర్కారు బీఆర్‌ఎస్ అన్నారు. ఎక్కడ ఎల్లమ్మ గుడి కట్టినా ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ 500 సిమెంట్ బస్తాలు ఇస్తున్నారని గుర్తుచేశారు. పొన్నం మాటలు వింటే మనం ఆగమైపోతామని, మనల్ని ఆదుకునే వారికి ఓటు వేయాలని కోరారు. సమావేశంలో గౌడ జేఏసీ చైర్మన్ పూదరి రాజేశ్వరిగౌడ్, బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బొమ్మగాని శ్రీనివాస్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ శ్రీపతి రమ, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు గొడిశాల సమ్మయ్యగౌడ్, మహిళా విభాగం ఇన్‌చార్జి అనురాధగౌడ్, నాయకులు బొమ్మగాని రాజేశంగౌడ్, అనగోని వీరన్నగౌడ్, పాకాల శ్యామ్‌సుందర్, పూదరి లక్ష్మీనారాయణ, పర్శరాములుగౌడ్, చెప్యాల శ్రీనివాస్‌గౌడ్, కుర్ర సాంబమూర్తి, పుట్ట ప్రతాప్, గొడిశాల వినయ్, ఉట్కూరి కార్తీక్, వీరన్న, వెంకన్న, రావుల లక్ష్మణ్, శ్రీపతి సంపత్, తిరుపతి, గొడిశాల రాజేశ్, రాజయ్యగౌడ్, లచ్చయ్యగౌడ్ పాల్గొన్నారు.

## సతీశ్‌కుమార్‌తోనే హుస్నాబాద్ అభివృద్ధి

హుస్నాబాద్ టౌన్, నవంబర్ 21 : ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్‌తోనే హుస్నాబాద్ పట్టణం అభివృద్ధి చెందిందని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత అన్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో మంగళవారం బీఆర్‌ఎస్ ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధిని సమానంగా నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని మరోమారు ఆశ్వీరదించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కొంకట నళినీదేవి, గూళ్ల రాజు, బొల్లి కల్పన, జనగామ రత్నమాల, బొజ్జ హరీశ్, వాల సుప్రజ, మాజీ కౌన్సిలర్ పచ్చిమట్ల ప్రతిభ, బీఆర్‌ఎస్ నాయకులు కాధాసు థామస్, మిల్కూరి రవీందర్, దొంతరబోయిన శ్రీనివాస్, సిరిసిల్ల సతీశ్, గడ్డ రమేశ్, మ్యాకల ఓదెయ్య పాల్గొన్నారు.